క్లుప్తంగా

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

మోమిన్‌పేట: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక క్యాలెండర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం నిరంతరం పోరాడుతానన్నారు. మండలంలోని ఏన్కతల గ్రామంలో గతంలో వికలాంగులకు కేటాయించిన 20ఎకరాలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే వికలాంగులకు ట్రై సైకిల్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మురహరి, మండల కార్యదర్శి మురళిధర్‌రావు, సభ్యులు పద్మమ్మ, క్రిష్టయ్య తదితరులు ఉన్నారు.

ఈకేవైసీని త్వరగా పూర్తి చేయండి



రేషన్ డీలర్లకు సూచనలు చేస్తున్న శ్రీనివాసులు

కుల్కచర్ల: ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈ కేవైసీ ప్రక్రియను విజయవంతం పూర్తి చేయాలని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో ఈ కేవైసీ పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు రేషన్ డీలర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎవరూ కూడా ఈ కేవైసీ చేయడంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న కార్మికుల సార్వత్రిక సమ్మె



మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

తాండూరు టౌన్ : కార్మికుల సమస్యలను పరిష్కరించని ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు దిగనున్నట్లు తాండూరు మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం పట్టణ మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులు మృతి చెందితే రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా , పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగనున్నట్లు చెప్పారు.

పాస్టర్స్ నూతన కమిటీ ఏర్పాటు



ఎన్నికైన నూతన కమిటీ

అనంతగిరి: వికారాబాద్ నియోజకవర్గం పాస్టర్స్ నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. వికారాబాద్ పట్టణంలోని మెథడిస్టు చర్చిలో ముఖ్య ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా రెవ.యస్.పవన్ జాన్, ఉపాధ్యక్షుడిగా జాన్ విక్టర్, కార్యదర్శిగా ఎలియాజర్, జాయింట్ సెక్రటరీగా ఓనేసిమస్, కోశాధికారిగా విజయ్‌కుమార్, ప్రోగ్రాం సెక్రటరీగా దేవదాసు, మీడియా సెక్రటరీగా బి.యేసుదాసు, సభ్యులుగా జైపాల్, యేసుదాసు, సైలస్‌లను ఎన్నుకున్నారు. అలాగే, వికారాబాద్ టౌన్ కమిటీ అధ్యక్షుడు రెవ. జాన్ విక్టర్, ఉపాధ్యక్షుడిగా పవన్ జాన్, కార్యదర్శిగా యేసుదాసు, జాయింట్ సెక్రటరీగా ఎలియాజర్, కోశాధికారిగా కృప నందరావు, సభ్యులుగా రాజు, భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

నులిపురుగులను నివారిద్దాం

షాబాద్: నులిపురుగు నివారణకు కృషి చేయాలని చందనవెల్లి, వెద్యులు వరలక్ష్మి, శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ నెల 12న నిర్వహిస్తున్న నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం షాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీపై వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1–19 ఏళ్ల లోపు చిన్నారులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. 1–2 ఏళ్ల చిన్నారులకు సగం మాత్ర పొడిచేసి నీటిలో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తదితరులున్నారు.

‘సహకారం’లో అవిశ్వాసం?

- ప్రాథమిక వ్యవసాయ సంఘంలో మొదలైన రాజకీయం
- కొత్త ఛైర్మన్ ఎన్నిక దిశగా ప్రయత్నాలు
- రెండు రోజుల్లో ఛైర్మన్ ఎన్నికకు రీనోటిఫికేషన్ అవకాశం



కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘం

కుల్కచర్ల: రాష్ట్ర రాజకీయంలో మార్పులు రావడంతో క్షేత్రస్థాయిలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కుల్కచర్ల మండలంలో సైతం అటువంటి కదలికలు మొదలయ్యాయి. మండలంలోని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా బుయ్యని మనోహర్ రెడ్డి బాధ్యతలు నిర్వహించడంతో పాటుగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగారు. అసెంబ్లీ ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో చైర్మన్, డీసీసీబీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. దీంతో కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘ చైర్మన్ కుర్చీ ఖాళీ అవ్వడంతో ఆ స్థానం కోసం ఆశావహులు పలు మార్గాలను అనుసరిస్తూ పలువురు నేతలతో మంతనాలు జరుపుతున్నారు.

వైస్ చైర్మన్‌కు చైర్మన్‌గా బాధ్యతలు

మనోహర్‌రెడ్డి రాజీనామాతో సహకార సంఘ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న నాగరాజు యాదవ్‌కు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. కొన్ని రోజులు ఎలాంటి రాజకీయ అలజడి లేకపోవడంతో నాగరాజు యాదవ్ పూర్తికాలం కొనసాగే అవకాశం ఉందంటూ ప్రచారం జరిగింది. ఆయన చైర్మన్ బాధ్యతలను నిర్వహిస్తూ సంఘ కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.

హడావిడిగా సమావేశం, కొత్త డైరెక్టర్ ఎన్నిక

మనోహర్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన తిర్మలాపూర్ డైరెక్టర్ స్థానాన్ని అదే గ్రామానికి చెందిన కనకం మొగులయ్యను సోమవారం పాలకవర్గ ఏకగ్రీవ తీర్మానంతో ఎన్నుకున్నారు. ఇన్నిరోజులు సాధారణంగా కొనసాగిన కుల్కచర్ల సహకార సంఘ కార్యక్రమాల నిర్వహణ సోమవారం హడావిడిగా పాలకవర్గ సమావేశం నిర్వహించి ఉన్నతాధికారులు ఎవరూ హాజరుకాకపోయినా, పాలకవర్గ సభ్యుల ఏకాభిప్రాయమే ప్రాతిపదికగా ఎన్నిక నిర్వహించారు. కాగా, జిల్లా సీనియర్ నాయకులుగా కొనసాగుతున్న కనకం మొగులయ్యను సహకార సంఘ చైర్మన్‌గా నియమించేందుకే ఇంత హడావిడిగా ఎన్నిక నిర్వహించారంటూ ప్రచారం సాగుతోంది.

రీ నోటిఫికేషన్‌కు చాన్స్?

కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి నూతనంగా చైర్మన్‌ను ఎన్నిక చేసేందుకు మళ్లీ రీ నోటిఫికేషన్ వేయడం జరుగుతుందని ప్రచారం సాగుతోంది. అధికారికంగా పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి మెజార్టీ సభ్యుల తీర్మానం మేరకు కొత్త చైర్మన్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. సర్వత్రా చర్చనీయాంశంగా మారిన ఈ అంశం ఎటు వైపు వెళ్తుందోనని పలువురు చర్చించుకుంటున్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి: పార్టీలకు అతీతంగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. పార్టీలు పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అధిక నిధులను మంజూరు చేయించి ఆదర్శంగా తీర్చిదిద్దుదామన్నారు. ఏఏ వార్డుల్లో ఏఏ సమస్యలు ఉన్నాయో వార్డుల వారీగా చర్చించి సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అలాగే, మున్సిపల్ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పట్టణంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం పనులు నిర్వహించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన మున్సిపల్ కార్యాలయ నిర్మాణానికి రూ.5 కోట్లు, పట్టణ అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం మున్సిపల్ చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రవికుమార్, రవీందర్, కృష్ణ, వెంకటేశ్, కిరణ్, నాగేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పక్కా భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న హరీశ్‌రావు

అనంతగిరి: వికారాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏబీవీపీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థినిలకు మూత్రశాలలు నిర్మించపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పేద, మధ్య తరగతి గ్రామీణ విద్యార్థులు డిగ్రీ విద్యపైనే ఆధారపడి ఉన్నారని, వేలకు వేలు ఫీజులు కట్టలేకనే ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగదీశ్‌చారి, మంజునాథ్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయలక్ష్మి సేవలు మరువలేనివి

సహకార సంఘం మాజీ ఛైర్మన్ రఘుపతిరెడ్డి



విజయలక్ష్మి రాచన్న దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మర్పల్లి: గత 5 సంవత్సరాల గ్రామ పంచాయతీ పాలనలో సర్పంచ్ విజయలక్ష్మి రాచన్న గ్రామాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి సహకార సంఘం మాజీ చైర్మన్ రఘుపతిరెడ్డి అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు సర్పంచ్ విజయలక్ష్మి రాచన్న దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సహకార సంఘం మాజీ చైర్మన్ రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ విజయలక్ష్మి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. సన్మాన గ్రహీత మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని సమర్థవంతంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తమకు సహకరించిన పంచాయతీ పాలక వర్గం సభ్యులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పంచాయతీ వార్డు మెంబర్లు పంచాయతీ కార్యదర్శి సప్న తదితరులు ఉన్నారు.

నేటి నుంచి జాతీయ సైన్స్ దినోత్సవ పోటీలు

బొంరాస్‌పేట: జాతీయ సైన్స్ దినోత్సవం సంబరాల సందర్భంగా నేటి (మంగళవారం) నుంచి 23 వరకు పాఠశాలల్లో వివిధ రకాల ప్రతిభ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన ఏడు రకాల అంశాలు కవిత్వం, పాటలు పాడటం, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే అంశాలు చెత్తను తగ్గించడం, ఈ–వ్యర్థాలను తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లను దత్తత తీసుకోవడం, సుస్థిరమైన ఆహార వ్యవస్థను దత్తత తీసుకోవడం, ఒకసారి వాడిన ప్లాస్టిక్‌ను తిరస్కరించడం, నీటిని పొదుపుగా వాడటం, శక్తిని కాపాడటం అంశాలపై పోటీలుంటాయన్నారు. నేడు మంగళవారం పాఠశాలల స్థాయి, బుధవారం మండల స్థాయి, ఈనెల 12న జిల్లాస్థాయి, 28న రాష్ట్రస్థాయి రవీంద్రభారతిలో పోటీలుంటాయన్నారు. భాషోపాధ్యాయులు, సైన్స్, చిత్రలేఖనం ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలన్నారు.

నేడు పూడూరులో కిసాన్ మేళా

పూడూరు: పూడూరు మండల కేంద్రంలో నేడు (మంగళవారం)కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తులసిరాం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11 గంటలకు క్రీడా ఆధ్వర్యంలో పూడూరు రైతు వేదికలో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బహిరంగ వేలం

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ జాతర బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, ఏడాదిపాటు లడ్డూ ప్రసాదం, పులిహోర అమ్మటకు బహిరంగ వేలం నేడు (మంగళవారం)నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ రాజేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల 15వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు అమ్ముటకు రూ.80వేలు డిపాజిట్, ఆలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 16 నుంచి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల ముందు వారం వరకు (ఒక సంవత్సరం) టెంకాయలు అమ్ముటకు రూ.90వేలు, అలాగే లడ్డూ ప్రసాదం, పులిహోర ఏడాది పాటు అమ్ముకునేందుకు రూ.30వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చైర్ పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: క్రిటికల్ కేర్ బ్లాక్ ఆస్పత్రి నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, సకాలంలో వైద్యం అందుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ అభిప్రాయపడ్డారు. రాజీవ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రూ.16 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించే క్రిటికల్ కేర్ బ్లాక్ ఆసుపత్రి నిర్మాణానికి సోమవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో భూమి పూజ చేశామన్నారు. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా 50 పడకలతో క్రిటికల్ కేర్ బ్లాక్ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ఆస్పత్రి ప్రసాద్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని మంజూరు చేయించారని అన్నారు. స్పీకర్ సహకారంతో జిల్లా కేంద్రంలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ ముక్తార్ షరీఫ్, కౌన్సిలర్లు మురళి, వేణుగోపాల్ రెడ్డి, క్రిష్ణ, కాంగ్రెస్ నాయకులు మాలె లక్ష్మణ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంచంద్రయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకంతో లబ్ధి



ర్యాలీలో పాల్గొన్న ఉపాధి కూలీలు

కొడంగల్ రూరల్ : ఉపాధిహామీ పథకాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌పీ దయాకర్ అన్నారు. సోమవారం మండలంలోని రావులపల్లిలో ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకులు భీమప్ప ఆధ్వర్యంలో ‘రైతు కూలీల హక్కులు’ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఉపాధిలేని గ్రామాలు వెలుగులేని దీపాలవంటివని, హక్కులను ప్రశ్నిస్తూ అభివృద్ధి సాధిద్దామనే నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ విభాగం ప్రోగ్రాం మేనేజర్ అశోక్, ఎస్టీఎం అంజద్‌అలీ, ఏపీసీ శ్రీధర్, ఎస్ఆర్పీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కడా ప్రత్యేకాధికారి, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్

కొడంగల్ రూరల్ : పట్టణంలోని కడా కార్యాలయంలో సోమవారం మండలంలోని 126మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డిలు పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో తోడ్పాటు అందుతుందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రహతుల్లాఖాన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్, కౌన్సిలర్ రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంతు, నాయకులు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకు సన్మానం



మల్లయ్యను కుటుంబ సమేతంగా సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: నేటి యువత మల్లయ్యను ఆదర్శంగా తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్యయాదవ్, సంఘం రాష్ట్ర నాయకులు నర్సింలు పేర్కొన్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లికి చెందిన మల్లయ్యయాదవ్ సైబరాబాద్ కమిషనరేట్‌లో గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ వింగ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన సైబరాబాద్ స్పోర్ట్స్ మీట్‌లో మల్లయ్య యువ కానిస్టేబుళ్లు 30మందితో పోటీపడి 10 కిలోమీటర్ల పరుగుపందెంలో మూడవ స్థానంలో నిలిచాడు. 5 కిలోమీటర్ల పరుగుపందెంలో 4వ స్థానాన్ని సాధించాడు. 50 సంవత్సరాల వయస్సులో సైతం యువకులతో పోటీపడి పరుగు పందెంలో ప్రతిభను చాటడం పట్ల యాదవ సంఘం ఆధ్వర్యంలో అతని ఘనంగా సన్మానించారు.

లక్ష్మారెడ్డికి ప్రముఖుల నివాళి



లక్ష్మారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

కుల్కచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల సర్పంచ్ శిరీష భర్త, ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ జెడ్పీ చైర్మన్ సునితామహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాజకీయ జీవితంలో గ్రామాభివృద్ధికి, నిరుపేదల అభివృద్ధికి, ఉపాధ్యాయులుగా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేందుకు ఆయన శక్తికి మించి కృషి చేసేవారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

తపస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు



దోమ : కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తపస్ మండల అధ్యక్షుడు రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం 2023 అక్టోబర్ మాసంలో ఆరు నెలల కాలవ్యవధిలో పీఆర్సీ నివేదికను ఇచ్చేలా ఇద్దరు వ్యక్తులతో కమిటీని ఏర్పాటు చేసి 5శాతం ఐఆర్ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసిందన్నారు. కానీ, ఈ ప్రభుత్వం ఉద్యోగులపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికి ఆచరణలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యం చూపుతుందని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డీఏ, పీఆర్సీని ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధికి సహకరించండి

- మూడు వందల కోట్ల నిధుల నివేదిక
- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్ రూరల్ : సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ పట్టణ అభివృద్ధికి అందరు సహకరించాలని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 3వందల కోట్లకు పైగా నిధుల ప్రణాళికతో నివేదికలు సిద్ధం చేసి సీఎం కార్యాలయానికి పంపించామన్నారు. వినాయక, అంబేడ్కర్ చౌరస్తాల్లో పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న డబ్బాలను తొలగించాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. వినాయక చౌరస్తా నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వరకు, వినాయక చౌరస్తా నుంచి శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయం రోడ్డు వెడల్పు పనులకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ చౌరస్తాలో మురుగు కాలువ మరమ్మతు పనులతో పాటు పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా, ప్రజల సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. మున్సిపల్ కార్మికుల వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సి ఉందని, మున్సిపల్ పరిధిలో ప్రస్తుతం ఆదాయం తక్కువగా ఉన్న కారణంగా ప్రభుత్వం 50లక్షల నిధులు మంజూరు చేయాలని కడా ప్రత్యేకాధికారికి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



కరెంట్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

షాబాద్: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు యాదవరెడ్డి డిమాండ్ చేశారు. సాగుకు సరఫరా చేస్తున్న విద్యుత్ నాణ్యత లోపించి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విద్యుత్ కార్యాలయం వద్ద భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం ఏఈ నరేందర్ నాయక్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కేశవ గూడ, ఎర్రోనిగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడడంతో బోరు మోటార్లు కాలిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు తదితరులున్నారు.